ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
బుధవారం 5 ఫిబ్రవరి 2025



దేవునికడపలో సాగుతున్న స్వామివారి రథం

కాంచిన కనులదే భాగ్యం

- అద్వితీయం బ్రహ్మాండనాయకుని రథోత్సవం
- పోటెత్తిన భక్తజనం
- గోవిందనామ స్మరణతో మార్మోగిన దేవునికడప

కడప కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఏడుకొండలవాడుగా.. ఆపద మొక్కుల వాడుగా.. అభయప్రదాతగా.. అశేష భక్తజన నీరాజనాలందుకుంటున్న శ్రీనివాసుని రథోత్సవం కాంచిన కనులదె భాగ్యం అన్నట్టుగా సాగింది. బ్రహ్మాండనాయకుడి రథోత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తజనంతో దేవునికడప వీధులు పోటెత్తాయి. తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆలయ వార్షికోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారి రథోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని అరటి, మామిడి ఆకుల తోరణాలతో, విద్యుత్‌దీప కాంతులతో ముస్తాబు చేశారు. స్వామివారు ఊరేగే రథాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. శ్రీదేవి భూదేవి సమేత తిరుమలేశుని ముస్తాబుగావించి రథంపై కొలువుదీర్చారు. ఏడుకొండల వాడిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు. నగరంలోని క్రిష్ణ సర్కిల్ నుంచి దేవునికడప వెళ్లే మార్గం భక్తులతో నిండిపోయింది. అడుగడుగునా భక్తులు గోవిందనామస్మరణతో దేవునికడప పురవీధులు మారుమోగాయి.





రథం లాగేందుకు పోటీ పడ్డ భక్తులు

వైకుంఠవాసుడు కొలువుదీరిన రథాన్ని దేవునికడప యువత భక్తజనంతో కలిసి కదిలించారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమోహన్, తరుణ్ వేదమంత్రాలు పఠిస్తుండగా.. సంగీత సుస్వరాలు, మంగళవాయిద్యాల నడుమ భక్తజనం కోలాహలంతో తేరు ముందుకు కదిలింది. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. తేరు కదిలే ప్రదేశంలో గుమ్మడికాయలు, మిరియాలు చల్లి రథాన్ని తాకడమే భాగ్యంగా భక్తులు భావించారు. మాడవీధుల్లో స్వామివారు వస్తుంటే అక్కడి స్థానికులు ఆహ్వానం పలికి కాయకర్పూరం సమర్పించి మొక్కుబడులు తీర్చు కున్నారు. దారి పొడవునా అన్నమయ్య కీర్తనలు, కోలాటాలు, చెక్కభజనలతో కళాకారులు ఆకట్టుకున్నారు. అడుగడుగునా భక్తుల గోవిందనామ స్మరణతో దేవునికడప పురవీధులు మారుమోగాయి. మధ్యాహ్నం 3.30 గంటలకు మొదలైన రథోత్సవం సాయంత్రం 5.45 గంటలకు ముగిసింది. కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి కుటుంబ సమేతంగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. రథోత్సవం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. దేవునికడప ముఖ ద్వారం వద్దనే వాహనాలు నిలిపివేశారు. వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి దగ్గరుండి రథోత్సవం ఏర్పాట్లను పర్యవేక్షించారు.



తేరును లాగేందుకు పోటీపడుతున్న భక్తులు



వెంకటేశ్వరుని రథోత్సవం సందర్భంగా భక్తజనసంద్రంగా మారిన దేవునికడప వీధులు

కొండలూ కబ్జా..!

బి.కోడూరు మండలంలో వైసీపీ ప్రభుత్వంలో కొండలు, గుట్టలు, వంకలు, వాగులు, చెరువుతొట్లు కబ్జాకు గురయ్యాయి. ప్రభుత్వం మారడంతో కబ్జాలకు చెక్ పడుతుందని ప్రజలు భావించారు. అయితే కూటమి ప్రభుత్వంలోనూ కబ్జాలు జరుగుతూనే ఉన్నాయి. ఏకంగా కొండలనే చదును చేసి, చెక్‌డ్యాంలను పూడ్చేసి మరీ కబ్జా చేస్తుండటం విశేషం. అధికారులకు ఇదంతా తెలిసినా చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

- ఇష్టానుసారంగా చదును చేసి కంచెలు
- చెక్‌డ్యాంలూ ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు
- ఇంత జరుగుతున్నా పట్టించుకోని అధికారులు



తూర్పుకొండను చదును చేసి కంచె వేసిన దృశ్యం

బి.కోడూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోరుమామిళ్ల - బద్వేలు మెయిన్‌రోడ్డు, మున్నెల్లి రెవెన్యూ పొలంలో తూర్పున సర్వే నెం.2736లో తూర్పుకొండ దాదాపు 800 ఎకరాలు విస్తరించి ఉంది. అదే మెయిన్‌రోడ్డుకు పడమటి భాగాన సర్వే నెం.2735లో దాదాపుగా 400 ఎకరాల మేర కొండ ఉంది. ఈ కొండలను యథేచ్ఛగా చదును చేసి కంచెలు వేస్తున్నారు. బద్వేలు- పోరుమామిళ్ల మెయిన్‌రోడ్డు కావడం, భూములకు అమాంతం రేట్లు పెరగడంతో కొంత మందికి ఆశ ఎక్కువై కొండలను, ప్రభుత్వం నిర్మించిన చెక్‌డ్యాంలు, కుంటలు, గుట్టలను కూడా వదలకుండా స్వాహా చేస్తున్నారు. బద్వేలు, పోరుమామిళ్ల మెయిన్‌రోడ్డుకు పడమటిభాగాన ఇటీవల కొండను చదను చేసి దానికి కంచె ఏర్పాటు చేసుకున్నారు. విశేషం ఏమంటే అక్కడే కొండనుంచి వర్షం నీళ్ల చెరువులోకి వెళ్లేందుకు వంక ఉంది. ఆ వంకపైన గతంలో రూ.10 లక్షలతో చెక్‌డ్యాం నిర్మించారు. కబ్జాదారులు ఆ చెక్‌డ్యాం, వంకను కూడా పూర్తిగా పూడ్చివేసి పొలం తయారు చేశారు.

కొండలకు కంచెలు

ఇటీవల బద్వేలు, పోరుమామిళ్ల మెయిన్‌రోడ్డుకు ఐత్రంపేట నుంచి కొండంపల్లె వరకు రోడ్డుకు తూర్పుభాగాన ఉన్న కొండలు.. ఐత్రంపేట కాసానగరం సమీపాన పడమటి భాగాన ఉన్న కొండలు చదును చేసి పూర్తిగా కంచెలు ఏర్పాటు చేశారు. గతంలో పశువులు, మేకలు, గొర్రెలను మేత కోసం కొండలకు తోలుకెళ్లి మేపుకుని వచ్చే వారు. ఇప్పుడు కొండలు ఆక్రమించి కంచెలు వేయడంతో పశువులు, గొర్రెలు, మేకలు కొండకు వెళ్లేందుకు దారి లేకుండా పోయింది. ఈ వ్యవహారం గత వైసీపీ ప్రభుత్వంలో మొదలైంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా కబ్జాలు ఆగడం లేదు. యథేచ్ఛగా కొండలను ఆక్రమిస్తూనే ఉన్నారు.



చెక్‌డ్యాంను పూడ్చి పొలం తయారు చేసిన దృశ్యం

చెక్‌డ్యాంలు పూడ్చడంతో..

వర్షం నీరు వంకలు, వాగుల గుండా నేరుగా చెరువుల్లోకి వెళ్లకుండా వంకలకు మధ్య మధ్యలో అప్పటి టీడీపీ ప్రభుత్వం చెక్‌డ్యాంలు నిర్మించింది. వాటి వల్ల వర్షం నీరు నిల్వ ఉండి భూమిలోకి ఇంకా భూగర్భజలాలు పెరిగేవి. దీంతో బోర్లలో నీరు అందుబాటులోకి వచ్చి రైతులకు వ్యవసాయానికి, ప్రజలు తాగేందుకు ఉపయోగపడేవి. లక్షలాది రూపాయలతో వంకలకు అడ్డంగా చెక్‌డ్యాంలు నిర్మిస్తే.. వాటిని పూర్తిగా తొలగించి పొలాలు తయారు చేస్తున్నారు. దీంతో రైతుల పొలాల్లో వేసిన బోర్లలో నీరు రావడం లేదు. ఇప్పటికైనా ఈ వ్యవహారంపై అధికారులు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై బి.కోడూరు తహశీల్దారు మధు నాయక్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. కొండను చదును చేసిన విషయం తన దృష్టికి రాలేదని అన్నారు. వాటిని పరిశీలించి కొండలకు కంచెలు వేసిన వారిపై చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.

కడపలో మహానాడు కోసం స్థల పరిశీలన 7

దుర్భరంగా.. చేనేత బతుకులు 7

ఆ సమావేశానికి చట్టబద్ధత లేదు

- మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో జనవరి 31న టీడీపీ కౌన్సిలర్లు నిర్వహించిన సాధారణ సమావేశానికి చట్టబద్ధత లేదని మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. అనివార్యకారణాల వలన సాధారణ సమావేశం నిర్వహించలేమని, ఫిబ్రవరి 21న నిర్వహిస్తామని చెప్పి కౌన్సిలర్లకు కమిషనర్‌కు రాతపూర్వకంగా తెలిపామన్నారు. జనవరి 31న బడ్జెట్ సమావేశానికి హాజరయ్యి ఆ సమావేశం పూర్తిచేసి సాధారణ సమావేశం వాయిదా వేసినట్లు ప్రకటించి వెళ్లిపోయానన్నారు. తాను వెళ్లిపోయాక కమిషనర్ సమావేశం నిర్వహించారన్నారు. టీడీపీ కౌన్సిలర్లు మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించినందున ఆ సమావేశానికి చట్టబద్ధత లేదన్నారు. ఈ వ్యవహారంపై కోర్టుకు వెళుతున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సమావేశం నిడిపిన కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్లు బంగారురెడ్డి, ఖాజా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆయనపై చర్యలు తీసుకోండి

- మంత్రి అచ్చెన్నాయుడుకు ప్రభుత్వ విప్ లేఖ

కడప, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని జమ్మలమడుగు కో-ఆపరేటివ్ ఆఫీసరు ఎంవీ ప్రభాకర్‌పై అవినీతి అక్రమాలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మంత్రి అచ్చెన్నాయుడుకు ఫిర్యాదు చేశారు. ఎంవీ ప్రభాకర్ విధి నిర్వహణలో ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారని, తోటి సిబ్బందిని ఇబ్బందులు పెడుతున్నాడని తెలిపారు. గత పదేళ్లలో ఇంకా ఎన్నో అక్రమాలకు పాల్పడ్డాడని, అతనిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ఆయన ఓ లేఖలో కోరారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

- అవినీతి రహిత పాలనే సీఎం ధ్యేయం
- గత ప్రభుత్వంలోని అక్రమాల ప్రక్షాళన
- కబ్జాలపై ఉపేక్షించేది లేదు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్.సవిత

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో జిల్లాస్థాయి సమీక్షా కమిటీ (డీఆర్‌సీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమం, అభివృద్ధి పథకాలు అందాలన్నారు. అందుకు అనుగుణంగా అధికారులు క్షేత్రస్థాయిలో బాధ్యాతాయుతంగా పనిచేయాలన్నారు. పారదర్శకత, అవినీతి రహిత పాలనే లక్ష్యంగా నడుస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలను ప్రక్షాళన చేస్తున్నారన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా సుపరి పాలనకు నాంది పలికారన్నారు. జిల్లాలో జరిగిన భూకబ్జాలపై విచారణ చేపడుతున్నామని, ఎవరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు, అటవీ భూములు కబ్జాలు చేసిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. జగన్ సొంత నియోజకవర్గం పులివెందుల పట్టణంలో తీవ్ర తాగునీటి కొరత ఏర్పడిందన్నారు. ఎన్డీయే పాలనలో పులివెందుల వాసులకు తాగునీటి కష్టాలు రాకుండా చర్యలు తీసు కుంటున్నామన్నారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ శాఖల వారీగా సాధించిన ప్రగతిని పవర్ పాయింట్ ద్వారా వివరించారు. పల్లె పండుగ కార్యక్రమంలో మొదటి దశ ప్రతిపాదనలతో చేపట్టిన అభివృద్ధి పనులను 100 శాతం పూర్తి చేశామన్నారు. రానున్న వేసవిలో చేపట్టే ఉపాధి పనులను అత్యంత ప్రాధాన్యతగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. మార్చినెల లోపే ప్రతి నియోజక వర్గంలో ప్రత్యేక మేళాను ఏర్పాటు చేసి మహిళా సంఘాలకు, యువతకు స్వయం ఉపాధి కోసం రుణాల మంజూరు, సంబంధిత యూనిట్ల ఆస్తులను కూడా పంపిణీ చేయనున్నామన్నారు.



డీఆర్‌సీ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్.సవిత, చిత్రంలో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జేసీ అదితిసింగ్

ఉద్యాన పంటలకు 70-90 శాతం సబ్సిడీతో సూక్ష్మ సేద్య సాగు కోసం పరికరాలను కొనుగోలు చేసి ఇస్తామన్నారు. 78 పశు వైద్యశాలల ద్వారా 225 సచివాలయాల పరిధిలో సేవలు అందిస్తున్నామన్నారు. జిల్లాలో ఆరు ప్రధాన మేజరు రిజర్వాయర్లతో 80 శాతం మేర నీరు నిల్వ ఉందన్నారు. ఈ వేసవిలో పల్లెలు పట్టణాలలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రణాళికలు రూపొందిస్తున్నా మన్నారు. అన్ని ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ పనులు ప్రాధాన్యత క్రమంలో చేపడతామన్నారు. రెవెన్యూ సమస్యలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్నిరకాల అంశాలను ప్రత్యేక టాస్క్ ఫోర్సు కమిటీ విచారణ పూర్తి చేసిన తరువాతే చర్యలు తీసుసుంటున్నామన్నారు.

సమస్యలపై సమీక్షించిన కమిటీ సభ్యులు

జిల్లాలో సీజన్ల వారీగా పండిస్తున్న పంటలపై తెగుళ్ల నివారణ, ఎరువుల వాడకం, సాగు యాజమాన్యంపై రైతుల్లో పూర్తి స్థాయిలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఆ దిశగా వ్యవసాయాధికారులు చర్యలు చేపట్టాలని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో విస్తారంగా సాగులో ఉన్న ఉద్యాన పంటలైన చీనీ తోటలు ఎండుముఖం పడుతున్నాయని, ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. కరువు మండలాల ప్రకటనలో జిల్లా రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో నిరూపయోగంగా ఉన్న టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందుబాటులోకి తేవాలన్నారు. కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆర్.మాధవి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఒంటరి మహిళ లబ్ధిదారులుగా నమోదై చాలా మంది అక్రమంగా పెన్షన్లు పొందుతున్నారని దీనిపై విచారణ చేయాలన్నారు. సమావేశంలో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, అన్ని రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోలు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓట్లేసి రండి చూద్దాం

- వెటకారంగా ద్వితీయ శ్రేణి నేతలు
- నాలుగు గ్రామాలపై కక్ష సాధింపు
- భూములు ఆన్‌లైన్‌లో తొలగింపు
- రుణం కట్టమని ఒత్తిడి
- దిక్కుతోచని స్థితిలో రైతన్నలు



తరాలుగా సాగు చేసుకుంటున్న భూమి

బి.కోడూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గతంలో మాకు ఓట్లు పడలేదు, ఈ దఫా ఓట్లేసి వస్తే అప్పుడు రైతుల సమస్యలను పరిశీలిస్తామని ఎమ్మెల్సీ వద్దనున్న ద్వితీయ శ్రేణి నేతలు రైతుల పట్ల వెటకారంగా మాట్లాడుతున్నారు. ఓట్లు వేయలేదని నాలుగు గ్రామాల్లో సుమారు 1200 ఎకరాల భూములను ఆన్‌లైన్‌లో తొలగించడంతో రైతులకు ఇబ్బందలు తప్పలేదు. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి దగ్గరకు వెళ్లి మా భూములు ఆన్‌లైన్ నుంచి తొలగించారు, మీరైనా చెప్పండని గగ్గోలు పెట్టుకున్నా ఫలితం శూన్యం. అప్పటి నుంచి ఇప్పటి వరకు కలెక్టరు, ఆర్డీఓ, తహసీల్దారు కార్యాలయాల చుట్టూ రైతులు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ప్రభుత్వం మారినా వారికి ఇబ్బందులు తప్పడంలేదు. రుణాల బకాయిలు చెల్లించాలని బ్యాంకు అధికారులు గ్రామాల్లో రైతులను నిలదీస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో పడిన ఇబ్బందులే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ పడుతున్నామని పలువురు రైతులు వాపోతున్నారు. తరాలుగా బావుల తవ్వకం, మోటార్లు బాగించుకోవడం, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకున్నా ఆన్‌లైన్‌లో పేర్లను తొలగించారు. దీంతో చేసేదిలేక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఆన్‌లైన్‌లో పేర్లు తొలగించడంతో రుణాలు ఏకమొత్తంలో కట్టడమా, రెన్యువల్ చేయించుకోవడమా జరగాలని బ్యాంకు అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల భూ సమస్యలన్నీ తీర్చుతామని కూటమి ప్రభుత్వం ప్రకటనలతో రైతులు ఎంతో ఆశతో ఇప్పటికే రెండు గ్రామసభల్లో అర్జీలు ఇచ్చి అధికారులతో మొరపెట్టుకున్నా ఇంత వరకు ఎలాంటి పరిష్కారం దొరకలేదు.

ఆ నాలుగు గ్రామాలపై కక్ష

పాయలకుంట్ల, మాధవరాయునిపల్లె, పెదుళ్లపల్లె, తిప్పరాజుపల్లె గ్రామాల రైతులు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి వద్దకు వెళ్లి ఆన్‌లైన్ తొలగింపు విషయమై మొరపెట్టుకున్నారు. ఆయనెలాంటి పరిష్కార మార్గం చూపలేదు. ఈ నాలుగు గ్రామాల్లో దాదాపు 1200 ఎకరాల భూమిని ఆన్‌లైన్ నుంచి తొలగించి రైతులను ఇబ్బందులపాలు చేశారు. ఆన్‌లైన్‌లో తొలగించిన భూములు కింది స్థాయి అధికారులు యథావిధిగా చేసేందుకు అనుమతులు లేవని అధికారులు చెబుతున్నారని రైతులు వాపోతున్నారు.

బ్యాంకు ఒత్తిడి ఎక్కువైంది

ఈ నాలుగు గ్రామాల రైతులు వివిధ బ్యాంకుల్లో తమ పొలాలు తనఖా పెట్టి అధిక మొత్తంలో రుణాలు తెచ్చుకున్నారు. అయితే ఏటా రెన్యువల్ చేసుకుంటూ వస్తున్నారు. తమ భూములు ఆన్‌లైన్ నుంచి తొలగించడంతో బ్యాంకుకు వెళ్లి రెన్యువల్ చేసుకోవాలంటే భూముల ఆన్‌లైన్ పత్రం అడుగుతున్నారు. అది తీసుకువస్తామనుకుంటే భూములన్నీ ఆన్‌లైన్‌లో తొలగించారు. దీంతో ఏడాదిగా రైతులు బ్యాంకు వైపు కన్నెత్తి చూడడంలేదు. బ్యాంకు అధికారులు మాత్రం రోజూ ఇళ్ల వద్దకు వెళ్లి బకాయిలు చెల్లించాలంటూ రైతులను ఇబ్బందులు పెడుతున్నారు.

గ్రామసభలో అయినా మా సమస్యలు తీరేనా

కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటికే రెండు దఫాలుగా రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో రైతుల భూ సమస్యలు పరిష్కరించి ఎలాంటి సమస్య లేకుండా చూడాలన్నదే ప్రభుత్వ ధ్యేయం. అయితే మండలంలో అందుకు విరుద్ధంగా భూములు ఆన్‌లైన్‌లో తొలగించడం, వాటిని తిరిగి ఎక్కించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు గమనించి మా భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వారు ప్రభుత్వాన్ని, అధికారులను వేడుకుంటున్నారు. ఈ విషయమై తహసీల్దారు మధునాయక్ వివరణ ఇస్తూ గతంలో తహసీల్దార్లు చేసిన నిర్వాకంతోనే ఆన్‌లైన్ నుంచి భూములు తొలగించారు. ప్రస్తుతం ఇది మా చేతుల్లో లేదు. ఉన్నతాధికారులకు తెలపడమే మా బాధ్యత వారి ఆదేశాల మేరకే తప్పకుండా ఆన్‌లైన్ కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

600 ఎకరాలు ఆన్‌లైన్ నుంచి తొలగించారు



తిప్పరాజుపల్లె గ్రామం రెవెన్యూ పొలంలో దాదాపు 600 ఎకరాలు ఆన్‌లైన్ నుంచి తొలగించారు. గ్రామస్థులమంతా మూకుమ్మడిగా అధికారుల వద్దకు వెళుతున్నా వారు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా మా భూములు మాకు గతంలో మాదిరిగానే ఆన్‌లైన్‌లో ఉండేలా చూస్తే మంచిది. బ్యాంకు అధికారులు రోజూఇంటి చుట్టూ తిరుగుతుండడం ఇబ్బందిగా ఉంది.

దుగ్గినేని సుబ్బరామయ్య, రైతు, తిప్పరాజుపల్లె

మా గ్రామాలపైనే కక్షగట్టారు



పాయలకుంట్ల పంచాయతీలో కామకుంట, వేమకుంట, ఏ.కొత్తపల్లె రెవెన్యూ గ్రామాల్లో దాదాపు 600 ఎకరాలు ఆన్‌లైన్ నుంచి తొలగించారు. మా నాలుగు గ్రామాలపైనే కక్షగట్టారు. అంతా వెళ్లి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని అడిగినా ఆయన పట్టించుకోలేదు. మూడు తరాలుగా మేం భూములు సాగు చేసుకుంటున్నాం. ప్రస్తుత ప్రభుత్వం, అధికారులు మా సమస్యలు తీర్చాలని కోరుతున్నాం.

ఎల్.రాఘవరెడ్డి, రైతు, పాయలకుంట్ల

మల్లయ్యకొండకు రూ.6,64,916 ఆదాయం

- గతం కంటే పెరిగిన హుండీ ఆదాయం



హుండీ కానుకలను లెక్కిస్తున్న దేవదాయ శాఖ అధికారులు, భక్తులు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భ్రమరాంభిక సమేత మల్లికార్జున స్వామి మల్లయ్యకొండకు భక్తులు హుండీలో సమర్పించిన కానుకల ద్వారా రూ.6,64,916లు ఆదాయం చేకూరినట్లు ఆలయ ఈఓ మునిరాజ తెలిపారు. మంగళవారం ఆలయంలో కూటమి నేతలు, ఈఓ, ఆలయ ఇన్‌స్పెక్టర్ శశికుమార్ ఆధ్వర్యంలో భక్తులు హుండీలో వేసిన కానుకలు లెక్కించారు. గతేడాది అక్టోబరు 30 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 4వ తేదీ (3 నెలల 7 రోజులకు) వరకు వచ్చిన హుండీ కానుకలు లెక్కించగా ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కొండ పైకి పూర్తి స్థాయిలో రోడ్డు సౌకర్యం ఉండడం, ప్రతి సోమవారం కొండ పైకి ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు తిరుగుతుండడంతో భక్తుల తాకిడి పెరుగుతున్నట్లు తెలిపారు. గతేడాది అక్టోబరు 30వ తేదీన(3 నెలల 20 రోజులకు) హుండీ ద్వారా రూ.5,94,257లు ఆదాయం వచ్చింది. కూటమి నేతలు ఉత్తమ్‌రెడ్డి, మల్లయ్యకొండ మాజీ చైర్మెన్ గంగుల్‌రెడ్డి, పార్లమెంట్ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోముశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జి బేరి శీన, మాజీ ఉప సర్పంచ్ మణి, సుధాకర్‌రెడ్డి, మ్యూజికల్ శివ, రామలింగారెడ్డి, కేశవరెడ్డి, క్రిష్టారెడ్డి, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

పెన్షన్ సొమ్ముతో రచ్చబండలు ఏర్పాటు

రాజంపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సుమారు 70 ఏళ్ల వయసులో కేతా చెంచురెడ్డికి ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్‌ను పదిమందికీ ఉపయోగ పడేలా పనులు చేయిస్తున్నారు. పెన్షన్‌గా నాలుగు వేల రూపాయల పెన్షన్‌తో గ్రామ పరిసరాల్లో, ఆలయాల సముదాయల్లో, బస్ షెల్టర్ల వద్ద, రచ్చబండలు ఏర్పాటు చేస్తున్నారు. ఇలా పదికి పైబడి రచ్చ బండలు ఏర్పాటు చేసి అందరికీ ఆదర్శప్రాయమవుతున్నారు. వివరాల్లోకెళితే...

పుల్లంపేట మండలం కేతావాండ్లపల్లె(దిగువపల్లె గ్రామం) వాసి కేతా చెంచురెడ్డికి ప్రభుత్వం వృద్ధాప్య పెన్షన్ ప్రస్తుతం రూ.4 వేలు ఇస్తోంది. తనకు పదేళ్ల నుంచి ప్రభుత్వం ఇచ్చే ఈ పెన్షన్‌ను పది మందికి ఉపయోగపడేలా చేయాలన్నది ఆలోచన. చిన్నతనంలో ఎక్కడ వచ్చినా బోర్లు, గ్రామ చావిడిలు, రచ్చ బండలు ఉండేవి. అక్కడ పెద్ద పెద్ద చెట్లు ఉండేవి. అక్కడ గ్రామస్తులు అంతా కూర్చుని కబుర్లాడుకుంటూ కులాశాగా ఉండేవారు. పిడస తినడం, రచ్చబండ వద్దకు రావడం, ఆత్మీయులతో సరదాగా గడిపేవారు. ఈ రచ్చ బండలు గ్రామాల్లో ఐక్యతను తీసుకొస్తాయి. అయితే ప్రస్తుతం పుల్లంపేట - చిట్వేలి ఘాట్ రోడ్డు నట్టినడి అడవిలో అంబుల వీరయ్య ఆలయం ఉంది. ఇక్కడికి ఎందరో వస్తుంటారు. వారు కూర్చోవడానికి చిన్న బండ కూడా లేదు. అందుకే ఇక్కడ నేను పోగు చేసుకున్న పెన్షన్ సొమ్ము రూ.60 వేలతో మూడు నెలలుగా కష్టపడి ఇక్కడే ఉంటూ రచ్చబండ కట్టిస్తున్నా. సమీపం లో చుక్కనీరు లేకున్నా 10 కిలోమీటర్ల నుంచి ట్యాంకర్ల ద్వారా నీరు, సిమెంటు, ఇటుకలు, బండలు, మట్టి, రాళ్లను పోగు చేసుకుని ఆ అడవిలో రచ్చబండ నిర్మాణాన్ని పూర్తి చేశాడు. ఈ విషయమై అటువైపు వెళుతున్న ఆంధ్రజ్యోతి ఇంత అడవిలో రచ్చబండ నిర్మాణంపై చెంచురెడ్డితో మాట్లాడితే ఆయన చెప్పిన మాటలు ఆశ్చర్యాన్ని గొలిపాయి. ఇప్పటికే సుమారు 10కి పైబడి రచ్చబండలు కట్టించాను. పుల్లంపేట మండలం వేల్పులవారిపల్లె, కొమ్మనవారిపల్లె, అయ్యప్ప ఆలయం, తిమ్మయ్యగారిపల్లె, ఆంజనేయస్వామి గుడి, తుమ్మారెడ్డి తోపు ఇలా అనేక గ్రామాల్లో రచ్చబండలు కట్టించాను. ఏదో తను కష్టపడి సంపాదించిన సొమ్ముతో బిడ్డలు పంపే సొమ్ముతో పొట్ట పోసుకుంటున్నా ఈ పెన్షన్ సొమ్మును పది మందికీ ఉపయోగపడుతూ పది కాలాల పాటు పేరుండేలా ఈ రచ్చబండలు కట్టిస్తున్నా. ప్రభుత్వ సొమ్ముతో పది మందికి ఉపయోగపడే ఇలాంటి రచ్చబండలు ఎంతో బాగుంటాయన్నది నా ఆలోచన అంటూ తనదైనశైలిలో తన ఆనందాన్ని పంచుకున్నాడు చెంచురెడ్డి.



అడవిలో అంబుల వీరయ్య దేవాలయం వద్ద కేతా చెంచురెడ్డి కట్టిస్తున్న రచ్చబండ ఇన్‌సెట్‌లో చెంచురెడ్డి

గేటు మీద పడి విద్యార్థికి గాయాలు



పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థిపై గేటు పడడంతో గాయాలయ్యాయి. పీటీఎం మండలం కందుకూరులో చోటుచేసుకున్న సంఘటనపై వివరాల్లో కెళితే.... కందుకూరు వాసి ముబారక్ కుమారుడు అబ్దుల్ మతీన్ (6) కందుకూరు ఎంపీపీ పాఠశాలలో 1వతరగతి చదువుకుంటున్నాడు. రోజు లాగా పాఠశాలకు వెళ్లాడు. పాఠశాల నుంచి ఇంటికి వచ్చే క్రమంలో ప్రధాన గేటు మీద పడడంతో విద్యార్థికిగాయాలయ్యాయి. విద్యార్థి తల్లిదండ్రులకు కనీస విషయం తెలపకుండా, విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరో విద్యార్థిని వెంట బెట్టి ఇంటికి పంపించేశాడని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలపై ఉపాధ్యాయులకు బాధ్యత లేదా అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. గాయపడిన విద్యార్థిని కుటుంబ సభ్యులు బి.కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో నాడు -నేడు ద్వారా చేసిన పనులను నాసిరకంగా చేపట్టడంతోనే ఇలా ప్రమాదాలు జరుగుతున్నాయని కనీసం ఇప్పటికైనా ఇలాంటివి పునరావృత్తం కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

మద్యం దరఖాస్తులకు నేడే చివరి రోజు



రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గీత, ఉప కులాలకు కేటాయించిన మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసేందుకు నేడే చివరి రోజు అని రైల్వేకోడూరు ఎక్సైజ్ సీఐ తులసి తెలిపారు. జిల్లాలో 11 మద్యం షాపులు రాయచోటి మున్సిపాలిటీ (గౌడ్), రాజంపేట మున్సిపాలిటీ (ఈడిగ), మదనపల్లి మున్సిపాలిటీ (ఈడిగ), రామసముద్రం (ఈడిగ), వీరబల్లి(ఈడిగ), బి.కొత్తకోట రూరల్ (గౌడ్), నిమ్మనపల్లి(ఈడిగ), తంబళ్లపల్లి (ఈడిగ), నందలూరు(గౌడ్), కలకడ (ఈడి గ), పీలేరు(గౌండ్ల) దరఖాస్తులు స్వీరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏ షాపునకు దరఖాస్తు చేయదలచినా ఏ ఎక్సైజ్ స్టేషన్‌లో, ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్ట్

తొమ్మిది ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పట్టుబడ్డ దుంగలు, స్మగ్లర్లతో ఫారెస్టు అధికారులు

వీరబల్లి, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): వీరబల్లి ఫారెస్టు బీట్ పరిధిలో ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి 9 ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ బాలిరెడ్డి మార్గనిర్దేశకంలో ఆర్‌ఐ (ఆపరేషన్స్) సురేశ్‌కుమార్‌రెడ్డికి చెందిన ఆర్‌ఎస్‌ఐ లింగాధర్ టీం, ఎఫ్‌బీఓ అనిల్‌కుమార్‌తో కలిసి సోమవారం వీరబల్లి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. వీరు ఆ ప్రాంతంలోని ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లను తనిఖీ చేసుకుంటూ వెళుతుండగా ఝరికోన వద్ద కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా కొందరు పారిపోగా వెంబడించి ఆరుగురిని పట్టుకోగలిగామన్నారు. ఆ ప్రాంతంలో 9 ఎర్రచందనం దుంగలు లభించాయి. పట్టుబడిన వారిని తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించారు. పారిపోయిన వారి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఎస్‌ఐ ఎండీ రఫీ కేసు నమోదు చేశారు. డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, ఎండీ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను తమ పిల్లలుగా చూసుకోవాలి



సిద్దవరం కస్తూర్బా పాఠశాల సౌకర్యాలపై ఆరా తీస్తున్న డిప్యూటీ డైరెక్టర్ దేవరాజు

పెద్దమండ్యం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) విద్యార్థులను తమ పిల్లలాగా చూసుకోవాలని, వారి విద్యాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని కస్తూర్బా బాలికల పాఠశాల డిప్యూటీ డైరెక్టర్ దేవరాజు సూచించారు. మండలంలో మంగళవారం కస్తూర్బా బాలికల పాఠశాల రాష్ట్ర డైరెక్టర్ దేవరాజు, జిల్లా జీసీడీఓ మధుమతి పర్యటించారు. సిద్దవరం కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్నం భోజనం తనిఖీ చేసి పాఠశాల సౌకర్యాలపై ప్రిన్సిపాల్ రాణికుమారిని అడిగి తెలుసుకున్నారు. కాగా విద్యార్థినులకు పురుగులు పటిన అన్నం పెడు తున్నారని, విద్యార్థినుల చేత మరుగుదొడ్లు కడిగిస్తున్నారని గతవారం వైరల్ అయిన ఫొటోలు డీఈఓ సుబ్రమణ్యం దృష్టికి వెళ్లాయి. ఈ వ్యవహారంపై వివరణ కోరుతూ ప్రిన్సిపాల్‌కు డీఈఓ సోకాజ్ నోటీసు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ వెట్టిచాకిరి ఫొటోలు ఎప్పుడు, ఎవరు తీశారు, ఎందుకు వైరల్ చేశారని అందరిలో చర్చనీయాంశమైంది. పెద్దమండ్యం మోడల్ స్కూల్ విద్యార్థులతో వారు మాట్లాడుతూ పది, ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధనకు సూచనలు ఇచ్చారు. ఎంఈఓలు మనోహర్, రామకృష్ణ, ప్రిన్సిపాల్ రామాంజులు నాయక్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని రైతు మృతి



నరసింహులు మృతదేహం (ఇన్‌సెట్‌లో ఫైల్‌ఫొటో)

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):అనుమానాస్పద స్థితిలో చెట్టుకు ఉరివేసుకుని రైతు మృతి చెందడం సంచలనమైంది. పొన్నూటిపాళెంలో సోమవారం రాత్రి చోటు చేసుకున్న ఘటనపై తాలుకా సీఐ కళావెంకటరమణ తెలిపిన వివరాల్లోకెళితే... పిచ్చిలవారిపల్లె వాసి నరసింహులు(65) 20 ఏళ్లుగా తన భూమిలోకి వెళ్లడానికి అదే గ్రామానికి చెందిన కొందరు దారి ఇవ్వడంలేదని గొడవలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే సోమవారం దారి సమస్య తీర్చాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌కు స్పందనలో వినతిపత్రం అందజేశారు. విషయం తెలుసుకు న్న ప్రత్యర్థులు వారు పొలంలోకి పోకుండా సోమవారం సాయంత్రానికి అడ్డుగా వేశారు. ఏమి జరిగిందో ఏమో తెలియదు గానీ ప్రత్యర్థుల పొలంలోని పెద్ద చెట్టుకు ఉరేకుని మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడం తో తాలుకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుని భార్య రెడ్డెమ్మ ఫిర్యాదు మేరకు తాలుకా సీఐ అనుమానాస్పద స్థితి కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతునికి ఒకకూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సకల దేవతలకు ఆహ్వానం

- ధ్వజారోహణంతో ప్రారంభమైన వెంకన్న బ్రహ్మోత్సవాలు
- వైభవంగా స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం



పల్లకీ సేవలో స్వామి వారు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజారోహణతో ప్రసన్న వేంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయంలో మంగళవారం ఉదయం వేద పండితులు ఆలయ ధ్వజస్తంభం పైకి గరుడ ధ్వజాన్ని శాస్త్రోక్తంగా ఎగురవేశారు. వేకువనే సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపి ధూప, దీప నైవేద్యాలు సమర్పించి నిత్య కైంకర్యాలు పూర్తిచేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణ స్వామి ఉత్సవమూర్తుల సమక్షంలో వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తుల గోవింద నామస్మరణ మార్మోగింది. సకల దేవతలు, అష్టదిక్పాలకులు, సప్తమాత్రుకలు, ప్రాణకోటిని బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకు ధ్వజారోహణం ఘట్టం నిర్వహిస్తారని ప్రాశస్త్యం. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారి ఉత్సవర్లకు పాలు, పెరుగు, తేనే, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో వేడుకగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారికి పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం శేషవాహన సేవ, రా త్రి హంసవాహన సేవలు నిర్వహించనున్నారు. సూపరింటెండెంట్ మునిబాలకుమార్, వేదపండితులు పాల్గొన్నారు.

రైలు కింద పడి ఆత్మహత్య

చంద్రగిరి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి రవికుమార్‌యాదవ్(58) ఆత్మహత్య చేసు కున్నాడు. గుర్రంకొండ మండలం అరిగివారిపల్లెకు చెందిన రవికుమార్‌యాదవ్ మంగళవారం సాయంత్రం వెంటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు వస్తుండగా పట్టాలపై పడుకున్నాడు. పోలీసులు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం నుజ్జు నుజ్జు అవ్వడంతో రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు బంధువులు రవి కనబడడంలేదని గాలిస్తున్నారు. సెల్‌ఫోన్ సిగ్నిల్స్ ఆధారంగా శ్రీనివాసమంగాపురం చేరుకున్నారు. రవి ఆత్మహత్యకు కారణాలు తెలియలేదు.

పారదర్శకంగా పరిష్కరించాలి

రెవెన్యూ సదస్సు అర్జీలను వెంటనే పరిష్కరించండి : రెవెన్యూ అధికారులతో కలెక్టర్ చామకూరి శ్రీధర్



బ్రాహ్మణపల్లె వద్ద భూములను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్, సబ్‌కలెక్టర్ నిదియాదేవి

రాజంపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నెల రోజులు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. మంగళవారం రాజంపేట ఎంపీడీఓ కార్యాలయంలో రెవెన్యూ, ఇతర అధికారులతో సబ్‌కలెక్టర్ నిధియాదేవితో కలిసి సమీక్షించిన ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో 200 దరఖాస్తులు అందాయని వీటిని వెంటనే పరిష్కరించాలన్నారు. భూవివాదాలపై 26 వినతిపత్రా లు అందాయని, వీటిని పారదర్శకంగా పరిష్కరించాలన్నారు. అన్నదమ్ములు, సరిహద్దు, మ్యుటేషన్స్ సమస్యలపై ఎక్కువ అర్జీలు అందాయని వాటిని పారదర్శకంగా పరిష్కరించాలన్నారు. నిక్కచ్చిగా పనిచేసేటప్పు డు ఒత్తిడులు రావడం సహజమని, అంతమాత్రాన అధైర్యపడకుండా నిబంధనల మేరకు పని చేయాలన్నారు. సమష్టిగా పనిచేసినప్పుడే సమస్యను పరిష్కరించవచ్చునని, ఎక్కువ ఒత్తిడి ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెనువెంటనే పరిష్కరిస్తామన్నారు.

బ్రాహ్మణపల్లె భూములు పరిశీలన

బ్రాహ్మణపల్లె సర్వేనంబరు 101/3లో అందిన మ్యుటేషన్ సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఈ సమస్యను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దారు పీర్‌మున్నీ, ఎంపీడీఓ వరప్రసాద్‌రావు, వీఆర్వోలు, సర్వేయర్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అనుకూలంగా పునర్‌వ్యవస్థీకరణ

విద్యార్థులకు అనుగుణంగా పాఠశాలల పునర్ వ్యవస్థీకరణను చేపట్టాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ విద్యాశాఖాధికారులను ఆదేశించా రు. రాజంపేట ఎంపీడీఓ కార్యాలయంలో రాజంపేట, నందలూరు మండల ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ కారణంగా ఏ విద్యార్థి నష్టపోకుండా భవిష్యత్‌లో కూడా వారికి ఉపయోగ పడేవిధంగా పాఠశాల పునర్‌వ్యవస్థీకరణ ప్రక్రియను చేపట్టాలన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బంది లేకుం డా చేపట్టాలన్నారు. విద్యార్థులు పాఠశాలలకు వచ్చే రాకపోకలు, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని అదేవిధంగా ఉపాధ్యాయులకు ఎటువంటి నష్టం జరగకుండా అందుబాటు లో ఉండే భవనాలు, ఇతర మౌలిక వసతులు వృథా కాకుండా వాటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా పునర్‌వ్యవస్థీకరణ నిర్వహించాలన్నారు.

రీసర్వే పనులు పూర్తిచేయాలి : కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల సర్వేయర్లు ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్‌లో ఉన్న రీసర్వే పనులను పూర్తి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో తహసీల్దార్లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రీసర్వే, రెవెన్యూ సదస్సుల అర్జీలు, పీజీఆర్ఎస్ అర్జీలు, భూసేకరణ తదితర అంశాలపై సమీక్షించిన కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలు, పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. చాలా మండలాల్లో రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు. రీసర్వే గురించి మాట్లాడుతూ మండల సర్వేయర్లు అందరూ దృష్టి సారించి పెండింగ్‌లో ఉన్న రీసర్వే పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సబ్‌కలెక్టర్లు, ఆర్డీఓను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి వారం ఎంపీడీఓలు, తహసీల్దార్లతో ఈ అంశాలపై సమీక్ష నిర్వహించి పురోగతి సాధించాలన్నారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, డీఆర్ఓ మధుసూదనరావు, సబ్ కలెక్టర్లు, ఆర్డీఓ, సర్వే శాఖ ఏడీ, తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసులు నమోదు

చాపాడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి, అతని భార్య, కొడుకు శివారెడ్డిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాల మేరకు.. కుచ్చుపాప గ్రామం వద్ద భాస్కర్‌రెడ్డి, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్యనారాయణరాజు కలిసి మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి వద్ద సుమారు 40 ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నారు. ఈభూమిలో రొయ్యలు పెంపకం చేపట్టారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో భూమిలోని చెరువును చెరిసగం పంచుకున్నారు. మంగళవారం సూర్యనారాయణరాజు తనకు చెందిన చెరువులోని రొయ్యలను వ్యానులో ప్రొద్దుటూరు పట్టణానికి తీసుకుపోతుండగా భాస్కర్‌రెడ్డి, అతని భార్య, కొడుకు శివారెడ్డి అడ్డుకున్నారు. తమకు ఇవ్వాల్సిన పాత బాకీ రూ.లక్ష ఇవ్వాలని సూర్యనారాయణ రాజును నిలదీయడంతో వీరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో శివారెడ్డి ఆగ్రహంతో సూర్యనారాయణరాజును కొట్టాడు. ఈ మేరకు పై ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య



ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం నంగనూరుపల్లెకు చెందిన మేకల వైష్ణవి (19) అనే విద్యార్థిని ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాల మేరకు.. చాపాడు మండలం పల్లవోల వద్ద ఉన్న ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న వైష్ణవి నెలసరి కడుపు నొప్పితో తరుచూ బాధపడుతుండేది. ఎక్కడికి వెళ్లినా నొప్పి తగ్గకపోవడంతో మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వైష్ణవి తల్లి లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి మృతి



వేంపల్లె, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపల్లె సమీపంలో కడప-పులివెందుల రోడ్డులో జరిగిన ప్రమాదంలో రమేష్‌యాదవ్ (38) అనే ఐటీఐ ఉద్యోగి మృతి చెందాడు. వేములకు చెందిన శ్రీనివాసులు కుమారుడు రమేష్‌యాదవ్ వేముల ప్రభుత్వ ఐటీఐలో కాంట్రాక్టు పద్ధతిలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్నారు. పెండ్లిమర్రి మండలం తిప్పరాజుపల్లెకు చెందిన శోభారాణితో పదేళ్లక్రితం వివాహమైంది. వీరికి ఏడాది వయసున్న పాప ఉంది. అత్తగారి ఊరైన తిప్పరాజుపల్లెలో నివాసముంటూ వేముల ఐటీఐకి వెళ్లి వచ్చేవాడు. రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి వేముల నుంచి తిప్పరాజుపల్లెకు బైకులో వెళ్తుండగా నందిపల్లె వద్ద ట్రాక్టర్‌ను ఢీకొనడంతో తలకు గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సీఐ సురేష్‌రెడ్డి, ఎస్‌ఐలు వివరాలు సేకరించారు.

వ్యక్తిపై ఆటోడ్రైవర్ కత్తితో దాడి

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో ఖాజారసూల్ అనే వ్యక్తిని ఆటోడ్రైవర్ కత్తితో పొడిచిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఆటోలో బస్టాండుకు వచ్చిన ఖాజారసూల్‌ను ఆటోడ్రైవర్ డబ్బులు అడగగా ఇప్పుడు లేదు తరువాత ఇస్తాననడంతో ఇద్దరికి మాటామాటా పెరిగింది. దీంతో ఆటోడ్రైవర్ ఆటోలో ఉన్న కత్తితీసుకొని ఖాజారసూల్ పొట్టలో పొడిచాడు. వెంటనే స్థానికులు గాయపడిన వ్యక్తిని ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు తరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ద్వారకానగర్‌లో చోరీ

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గోపవరం మండలం ద్వారకానగర్‌లో రమణయ్య అనే వ్యక్తి ఇంట్లో సోమవారం రాత్రి 10 గంటలకు చోరి జరిగింది. రూరల్ ఎస్‌ఐ సురేష్ వివరాల మేరకు.. రమణయ్య బంధువులకు సంబంధించి దినకర్మ వుండటంతో సోమవారం ప్రొద్దుటూరు టౌన్‌కు కుటుంబ సమేతంగా వెళ్లారు. రాత్రి 10 గంటలకు ఇంటికి తిరిగి రాగా తలుపు తెరిచి వుండటంతో ఇంట్లోకి వెళ్లగా.. అప్పుడే ముగ్గురు వ్యక్తులు పరారయ్యారని తెలిపారు. ఇంట్లో బీరువాను పరిశీలించి బంగారు వస్తువులు పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దుర్భరంగా... చేనేతల బతుకులు

- ఇంటిల్లిపాది కష్టపడినా కూలి కూడా పడటం లేదని ఆవేదన
- గిట్టుబాటు ధర కల్పించాలి
- పెరిగిన ధరలకు అనుగుణంగా పనిముట్లు అందించాలి
- చేనేత సంఘాల నాయకుల డిమాండ్

తెల్లార్లు ఇంటిల్లిపాది కష్టపడినా కనీసం కూలీ కూడా గిట్టు బా టు కావడం లేదు... ఎన్ని ప్రభుత్వాలు మారుతున్న మా బతుకులు మాత్రం మారడం లేదు. ఎన్నికల సమయంలో మాత్రం నాయకులు అది చేస్తాం.. ఇది చేస్తాం అని చెబుతారు.. ఆ తర్వాత ఇటు వైపు కన్నెత్తి చూడరు.. ఏళ్లు గడుస్తున్నా మాకు కష్టాలు కన్నీళ్లు తప్పడం లేదు.. ఇది చేనేత కార్మికుల ఆవేదన.



గుంతమగ్గంలో నేత నేస్తున్న కార్మికుడు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): చేనేత పరిశ్రమ దుర్భరస్థితిలో ఉంది. ప్రస్తుతం చేనేతలకు గడ్డుకాలం ఏర్పడిందని... కరోనా సమయం నుంచి ఇప్పటి వరకు చేనేతలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని పలువురు చేనేత సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఓట్లకు మాత్రమే చేనేతలను ఉపయోగించుకుని తర్వాత ఆ పరిశ్రమ పట్లకానీ, కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదంటున్నారు. ప్రస్తుతం (గత నాలుగు నెలల నుంచి) పట్టు కిలో వెయ్యి రూపాయలు ధర పెరిగిందని, గతంలో రూ.4,400 ఉంటే ఇటీవల రూ.5,500లకు ధర పెరిగింది. దీంతో పట్టు నేత కార్మికులకు ఇంటిల్లిపాది కష్టపడినా గిట్టుబాటు ధర లేదని నేతన్నలు వాపోతున్నారు. ఇక కాటన్ (నూలు) ఒక లడిగె రూ.75 ధర ఉంది. ఒక చీరెకురెండు లడిగెల ఒక కట్టు ఖర్చు అవుతుంది. అయితే చేనేతలకు ఇచ్చే కూలి ఒక చీరెకు రూ.120 మాత్రమే రకాన్ని బట్టి ఉందని తెలిపారు. దీంతో తెల్లార్లు ఇంటిల్లిపాది కష్టపడినా కనీసం కూలి కూడా గిట్టుబాటు కావడం లేదని చేనేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. దీంతో ప్రస్తుతం పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు ఏమి కొనలేక, తినలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సబ్సిడీ ధరలకు అవసరమైన పనిముట్లు అందించి ఆదుకోవాలని చేనేతలు, నేత కార్మిక నాయకులు కోరుతున్నారు.

చేనేత పరిశ్రమను ఆదుకోవాలి



చేనేత పరిశ్రమ సంక్షోభంలో ఉంది. కార్మికులకు సక్రమంగా పనిలేక కొందరు వేరే వృత్తులోకి మారడం, మరికొందరు చేనేత రంగం వదిలి వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు చేనేత కార్మికులను ఆదుకునేందుకు సబ్సిడీకి పనిముట్లు ఇవ్వాలి. జీఎస్టీ రద్దు చేయడంతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలి. ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ఉచిత విద్యుత్తు వెంటనే అమలు చేయాలి. నూలు, పట్టు ధరలు తగ్గించాలి.

\- కాటా రామదాసు,
చేనేత ఐక్యవేదిక జాతీయ ఉపాధ్యక్షుడు

గిట్టుబాటు ధరకు ఉత్పత్తులు కొనేలా చూడాలి

చేనేత పరిశ్రమలో నేసిన ఉత్పత్తులను ఆప్కోసంస్థ ద్వారా గిట్టుబాటు ధరకు ఉత్పత్తులు కొనేలా చూడాలని చేనేత సంఘాల నాయకులు కోరుతున్నారు. అలాగే సబ్సిడీకి పనిముట్లు, పాస్‌పుస్తకాలు తదితరాలు అందించాలని, ఉచిత బీమాతో పాటు ఆరోగ్యబీమా సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. ఇక కేంద్ర ప్రభుత్వం నేతన్నలకు, వారి అభివృద్ధి కోసం పరిశ్రమ ముందుకు వెళ్లాలంటే జీఎస్టీ రద్దు చేయాలని కోరుతున్నారు. జీఎస్టీ పెట్టినప్పటి నుంచి చేనేత పరిశ్రమ పూర్తిగా దెబ్బతిందని.. ధరలు పెరిగి జీఎస్టీ కట్టలేక పెట్టుబడులు లేక మాస్టర్ వీవర్స్ ఇబ్బందులు పడుతున్నారు. చేసేది లేక కొందరు అదే పరిశ్రమపై ఊగిసలాడుతూ ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో చేనేత కార్మికునికి నేతన్న నేస్తం కింద ఏడాదికి రూ.24 వేలు ఇచ్చేదని.. కూటమి ప్రభుత్వం ఆదిశగా పెంచి ఇవ్వాలని కోరుతున్నారు. చేనేత కార్మిక రంగానికి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు అమలు చేయాలని కోరుతున్నారు.



పవర్‌లూమ్ మగ్గం నేస్తున్న నేత కార్మికుడు

క్యాన్సర్ రాకుండా అప్రమత్తంగా ఉండాలి

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ ప్రమాదకరమైన వ్యాధి అని, అది మన దరిదాపులకు రాకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వైద్యాధికారులు, సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్యాన్సర్ నివారణకు అనేక చర్యలు చేపడతోందన్నారు. ఇంటివద్దనే అందరికీ ఆరోగ్యం అందించాలనే దృక్పథంతో ఎన్‌సీడీ 3.0 సర్వే ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, పట్టణ ఆరోగ్య ప్రాథమిక కేంద్రాల వైద్యాధికారులతో, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలకు క్యాన్సర్ స్కీనింగ్‌పై శిక్షణ ఇచ్చామన్నారు. 18 సంవత్సరాలు పైబడిన స్త్రీ, పురుషులకు ఇంటింటా క్యాన్సర్, సర్వే కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రతి స్త్రీకి రొమ్ము క్యాన్సర్, 30 ఏళ్లు పైడిన మహిళలకు గర్భాశయం ముఖ ద్వారం పరీక్షలు, నోటి క్యాన్సర్‌తో పాటు రక్తపోటు వంటి వ్యాధులకు ఉచితంగా రక్త, ఆరోగ్య పరీక్షలు చేశామన్నారు. మంగళ, గురువారం రోజుల్లో స్పెషలిస్ట్ డాక్టర్లతో క్యాన్సర్ వ్యాధి రాకుండా అప్రమత్తం చేస్తున్నామన్నారు. ఆహారపు అలవాట్లు, జీవనశైలి, వ్యాయామంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరరావు, డీపీఎంఓ డాక్టర్ శశిభూషణరెడ్డి, డీఎల్‌ఏటీఓ డాక్టర్ సగిలి రవిబాబు, వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, వైద్యసిబ్బంది

విస్తరణ సేవలను రైతులకు అందించాలి

సికెదిన్నె, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ సేవలను రైతులకు అందించాలని ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న శాస్త్రీయ సలహా మండలి సమావేశానికి మంగళవారం ఆయన హాజరై మాట్లాడుతూ వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని, వాతావరణంలో మార్పులకు అనుగుణంగా తట్టుకునే రకాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం కోసం ప్రభుత్వం కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసిందన్నారు. కేవీకేలు రైతుల స్థితిగతులను మార్చడానికి ఎంతగానో తోడ్పడుతాయని.. రైతులకు పరిజ్ఞానం పెంచడానికి అనేక శిక్షణ కార్యక్రమాలు, సాంకేతిక కార్యక్రమాలను వివిధ దత్తత గ్రామాల్లో ఆచరించడం జరుగుతుందన్నారు. తిరుపతి ప్రాంతీ య వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకు లు డాక్టర్ వి.సుమతి మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్య లు, వ్యవసాయం, అనుబంధ సంఘాల అధికారుల నుంచి వచ్చే సలహాలు ఆధారంగా రాబోయే సంవత్సరానికి కార్యాచరణను, ప్రణాళికలను సిద్ధం చేసుకోవడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం కేవీకే సమన్వయకర్త వీరయ్య, ఏరువాక సమన్వయకర్త అంకయ్యకు మార్‌లు 2024-25 సంవత్సరానికి గాను సాధించిన ప్రగతిని, విస్తరణ సేవలను వివరించారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్, పశుసంవర్ధకశాఖ అధికారి గుణశేఖర పిళ్లై, పులివెందుల అరటి పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త శివరామకృష్ణ, వనిపెంట కేవీకే సమన్వయకర్త బాలకృష్ణ, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి, రైతు శిక్షణ కేంద్రం సహా య సంచాలకులు రమణారెడ్డి, పలువురు శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ

ఎస్‌ఏఆర్‌టీహెచ్‌ఐ కోఆర్డినేటర్‌గా డాక్టర్ రెడ్డయ్య

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వైవీయూలోని కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.రెడ్డయ్యను ఎస్‌ఏఆర్‌టీహెచ్‌ఐ (స్టూడెంట్స్ అంబాసిడర్ ఫర్ అకాడమిక్ రీ ఫార్మ్స్ ఇన్‌ట్రాన్స్‌ఫార్మింగ్ హయ్యర్ ఎడ్యుకేషన్) కోఆర్డినేటర్‌గా నియమించారు. విశ్వవిద్యాలయంలోని వీసీ చాంబర్‌లో డాక్టర్ రెడ్డయ్యకు ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, కులసచివులు ఆచార్య పి.పద్మ, ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డితో కలిసి నియామకపు పత్రాన్ని అందించారు. ఎస్‌ఏఆర్టీహెచ్‌ఐ సహాయకులుగా వైవీయూ బీసీడీఈ కోఆర్డినేటర్ వీసీ సంపత్‌కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జాతీయ విద్యావిధానం-2020 పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు విస్తృత ప్రచారంలోకి తీసుకెళ్లేలా చూడాలని అధికారులు కోరారు.

రిమ్స్‌లో ఎంబాల్వింగ్ మిషన్

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): డిపార్ట్‌మెంట్ ఆఫ్ అనాటమీ ప్రభు త్వ మెడికల్ కళాశాలలో నూతనంగా ఎంబాల్వింగ్ మిషన్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సురేఖ మంగళవారం ఆవిష్కరించారు. ఈ మిషన్‌ను ఉపయోగించి శరీరంలోకి రసాయనాలను పంపిస్తారు. దీని ద్వారా మానవ శరీరాలను భద్రపరిచి ఎంబీబీఎస్ విద్యార్థులకు ప్రాక్టికల్స్‌కు ఉపయోగిస్తారు. ఈ మిషన్‌ను శాంక్షన్ చేయించినందుకు ప్రిన్సిపల్‌కి అనాటమీ విభాగాధిపతి డాక్టర్ సి.యామినిదేవి కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, అనాటమీ డిపార్ట్‌మెంట్ సిబ్బంది, ఎంబీబీఎస్ మొదటి సంవత్సర విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంబాల్వింగ్ మిషన్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

డ్రాగా ముగిసిన ఆంధ్ర - హిమాచల్ ప్రదేశ్ మ్యాచ్

కడప స్పోర్ట్స్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న కల్నల్ సీకేనాయుడు ట్రోఫీ (అండర్ 23) నాలుగు రోజుల క్రికెట్ మ్యాచ్ మంగళవారం డ్రాగా ముగిసింది. ఓవర్ నైట్ స్కోరు 30 పరుగులతో తిరిగి రెండో ఇన్నింగ్స్‌కు దిగిన ఆంధ్రజట్టు ఆటకు చివరిరోజైన మంగళవారం తన రెండో ఇన్నింగ్స్‌లో 55.3 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 19 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన రేవంత్‌రెడ్డి తిరిగి బ్యాటింగ్ ప్రారంభించి 47 పరుగుల వద్ద ఔట్ అయ్యారు. దీంతో ఆంధ్ర జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 544, రెండో ఇన్నింగ్స్‌లో 203 పరుగులు మొత్తంగా రెండు ఇన్నింగ్స్‌లకు కలిపి 747 పరుగులు చేసింది. ఇందుకు ధీటుగా హిమాచల్‌ప్రదేశ్ జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 436 పరుగులు చేయగా.. చివరి రోజు తిరిగి రెండో ఇన్నింగ్స్ చేపట్టి 22.3 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 92 పరుగులు చేసింది. ఇందులో యోగ్‌దీప్ ఠాకూర్ 69 పరుగులు చేశారు. దీంతో నిర్వాహకులు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. కాగా మొదటి ఇన్నింగ్స్‌లో ఆంధ్రజట్టుకు ఆధిక్యత లభించింది.

నిత్యాన్నదాన పథకానికి రూ.50వేలు వితరణ

చక్రాయపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ప్రొద్దుటూరుకు చెందిన అర్షల వెంకటరెడ్డి, ఆదిలక్ష్మమ్మ, కుటుంబ సభ్యులు మంగళవారం నిత్యాన్నదాన పథకానికి రూ.50,116 విరాళంగా ఇచ్చారు. విరాళాన్ని సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్యకు అందించారు. ప్రధాన అర్చకులు కేసరి, మాజీచైర్మన్ వెంకటస్వామి పాల్గొన్నారు.

జడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా

కడప రూరల్, ఫిబ్రవరి 4: పార్లమెంట్ సమావేశాలు ఉన్న సందర్భంగా ఈ నెల 7న నిర్వహించాల్సిన జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని 8వ తేదీ శనివారం సెలవు రోజు నిర్వహిస్తున్నామని జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ తెలిపారు. ఈ మార్పును ప్రజాప్రతినిధులు, అధికారులు గమనించి సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని కోరారు.

మహానాడు కోసం స్థల పరిశీలన

(కడప - ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమాన్ని ఈసారి కడపలో నిర్వహించాలని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన పొలిట్ బ్యూరో సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. మే 27, 28, 29 తేదీల్లో మహానాడు నిర్వహించనున్నారు. డీఆర్‌సీ సమావేశంలో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన ఇన్‌చార్జ్ మంత్రి సవిత పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డిలు కలిసి మహానాడు నిర్వహణకు మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. రింగురోడ్డులోని జయరాజ్‌గార్డెన్ సమీపంలో, పులివెందుల రోడ్డులో, ఎయిర్‌పోర్టు పక్కనున్న మూడు చోట్ల స్థలాలను పరిశీలించారు. మహానాడుకు ఏపీ తెలంగాణ నుంచి కాక అండమాన్ నికోబార్, చెన్నై, కర్ణాటక ఇతర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున పార్టీ నేతలు, కేడరు తరలివస్తుంది. సభ నిర్వహణ అనంతరం మీటింగ్, వాహన పార్కింగ్‌కు పెద్ద ఎత్తున స్థలం అవసరం అవుతుంది. ఈ నేపథ్యంలో మూడుచోట్ల స్థలాలను పరిశీలించారు. ఇంకా ఏదీ ఫైనల్‌గా నిర్ణయించలేదు.

పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను ఆదుకోండి

టీడీపీ గెలుపు కోసం అహర్నిశలు జెండా మోసిన కార్యకర్తలను ఆదుకోవాలంటూ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవితకు పలువురు టీడీపీ నేతలు విజ్ఞప్తి చేశారు. డీఆర్‌సీ సమావేశంలో పాల్గొనేందుకు కడపకు వచ్చిన ఆమె కలవాల్సిందిగా కడప నగరంలో ఉన్న పలువురు టీడీపీ నేతలకు ఫోను చేశారు. దీంతో కొందరు విడివిడిగా కలిసి వారి సమస్యలను ఏకరువు పెట్టారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో పలువురు కడప టీడీపీ నేతలు కలిశారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ అమీర్‌బాబు, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎస్.గోవర్ధనరెడ్డి, హరిప్రసాద్, నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి, అలంఖాన్‌పల్లెకు చెందిన టీడీపీ నేతలు లక్ష్మిరెడ్డి, మన్మోహన్‌రెడ్డి, వీరయ్య తదితరులు మంత్రిని కలిశారు. అయితే వీరిలో కొందరు తాము పార్టీ కోసం కష్టపడినా గుర్తింపు లేదని, ఇసుక మాఫియా, మట్టిమాఫియా వల్ల పార్టీకి చెడ్డపేరు వస్తుంది. కష్టపడ్డ కార్యకర్తలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు చెబుతున్నారు.

టీడీపీ కార్యాలయం తొలగింపు

కడప నగరం చిన్నచౌకులోని అప్సర సర్కిల్‌లో ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయాన్ని సోమవారం సాయంత్రం, రాత్రి మూసివేశారు. ఈ ఏడాది 1 నుంచి 15 డివిజన్ల కేడరు కోసమంటూ గత ఏడాది జూన్ 16న ఎమ్మెల్యే ఆర్.మాధవి పార్టీ కార్యాలయాన్ని ఓపెన్ చేశారు. ఇది వైసీపీ నేత గుమ్మా రాజేంద్రనాథరెడ్డికి చెందినదని చెబుతారు. ఇక్కడ కార్యాలయం ఏర్పాటు చేయడంతో అప్పట్లో విమర్శలు వచ్చాయి. అయితే ఇటీవల టీడీపీ సోషల్ మీడియాలో కడప అప్సర సర్కిల్ చిన్నచౌకు ఏరియా ఆఫీసు ఏ హోదాతో నడుపుతున్నారు, ప్యారాచూట్ బ్రదర్స్ ఐదుగురు క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, 15 మంది యూనిట్ ఇన్‌చార్జ్‌లు, 105 మంది బూత్‌ఇన్‌చార్జ్‌లు, వెయ్యి మంది కార్యకర్తల అనుమతి ఉందా అంటూ ప్రశ్నిస్తూ పోస్టు చేశారు. ఈ నేపథ్యంలో ఇక్కడ కార్యాలయం క్లోజ్ చేయడం చర్చనీయాంశంగా మారింది.



మహానాడు కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సవిత



చిన్నచౌకులో టీడీపీ ఆఫీసును తొలగించిన దృశ్యం

పంచాయతీల అభివృద్ధికి సహకరించండి

● మంత్రి సవితకు సర్పంచుల వినతి

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు సర్పంచులు విన్నవించారు. ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లి గ్రామ పంచాయతీలో రిజిస్ట్రేషన్ శాఖ నుంచి స్టాంపు డ్యూటీ ఫీజులు రానందున అభివృద్ధి కుంటుపడిందని, వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను కొత్తపల్లి సర్పంచ్ శివచంద్రా రెడ్డి, ఇతర సర్పంచులు వినతిపత్రం అందజేశారు. కొత్తపల్లి పంచాయతీలో 300 చదరపు మీటర్ల లోపు గృహాలకు మాత్రమే భవన నిర్మాణ అనుమతులు ఇస్తున్నారన్నారు. గ్రామ పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం పంచాయతీల అనుమతి తీసుకోవాలని, కుడా పరిధి ఎక్కువగా ఉన్నందున పంచాయతీల అధికారాలకు కత్తెర పడుతోందన్నారు. డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలని, 14,15వ ఆర్థిక ప్రణాళికా నిధులను గ్రామ పంచాయతీలకు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నరేష్‌రెడ్డి, మత్తయ్య, కొండయ్య, చంద్రశేఖర్, శ్రీనివాసుల రెడ్డి పాల్గొన్నారు.

బీసీ గురుకుల పాఠశాల తనిఖీ

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):పట్టణ పరిధిలోని మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ గురుకుల పాఠశాలను మంత్రి సవిత మంగళవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. కడపలో నిర్వహించిన డీఆర్సీ మీటింగ్ ముగించుకుని అనంతపురం వెళుతూ మెడికల్ కాలేజీ సమీపంలో ఉన్న బీసీ గురుకుల పాఠశాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. డిప్యూటీ వార్డెన్ సుజాతతో హాస్టలుకు సంబంధించిన రిజిస్టర్లను తెప్పించుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఈ పాఠశాల కోసం తొండూరు మండలంలో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని, త్వరగా పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు.

సబ్సిడీ రుణాలు అందించాలి

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీ రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు యాదవ్ జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను కోరారు. బీసీలు నేటికీ వెనుకడి ఉన్నారని గుర్తుచేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి అర్హులైన వారికి రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మంత్రిని సత్కరించిన బీజేపీ నాయకులు



జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవితను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

కడప మారుతీనగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు విచ్చేసిన మంత్రి సవితను మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బీజేపీ జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, మాజీ అధ్యక్షుడు వంగళ శశిభూషణ్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్ సత్కరించారు. రానున్న రోజుల్లో కూటమి నాయకులతో కలిసి జిల్లాలో చేపట్టబోయే అభివృద్ధి పనులపై చర్చించారు.

పాలిటెక్నిక్ కళాశాల పేరు రాష్ట్ర స్థాయిలో నిలపాలి



బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కమలాపురం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయిలో పేరు నిలబెట్టాలని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులు తయారుచేసిన టెక్‌ఫెస్ట్ ప్రదర్శన, పరికరాలను ఆయన సందర్శించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు.

ప్రైవేట్ పాఠశాలల సమస్యలు పరిష్కరించండి

వేంపల్లె, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్‌కు వినతిపత్రం సమర్పించినట్లు కడప జిల్లా గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం జిల్లా అధ్యక్షుడు బీఎస్ రమణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం ఉండవల్లిలోని ఆయన కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కడప జిల్లా నుంచి తనతోపాటు గౌరవ అధ్యక్షుడు ఎన్.సోమశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.బాలసుబ్బారెడ్డిలు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

నాడు వెలవెల.. నేడు కళకళ

● కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ

● రూ.2.98 కోట్లతో సిమెంట్ రోడ్ల నిర్మాణం



పెండ్లిమర్రి మండలం కొత్తసంగటి పల్లెలో దుస్థితిలో ఉన్న రోడ్డు



కూటమి ప్రభుత్వంలో ఇలా కళకళలాడుతున్నరోడ్డు

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో వెలవెలబోయిన రోడ్లు ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కళకళలాడుతున్నాయి. పల్లె రోడ్ల బాగుకోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి చొరవతో పెండ్లిమర్రి మండలానికి రూ.2 కోట్ల 98 లక్షలు సిమెంటు రోడ్ల ఏర్పాటుకు మంజూరు చేయించారు. ఇప్పటికే మండలంలోని 19 గ్రామ పంచాయతీలలో రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేశారు. అలాగే గత ప్రభుత్వంలో రూ.ఆరు కోట్లతో నాసిరకంగా వేసిన పాతసంగటిపల్లె- చౌటపల్లె తారు రోడ్డు, ఇతర గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. ఉలవలపల్లె నుంచి కొండూరు గ్రామానికి వెళ్లే రోడ్డును పూర్తి చేశారు. కాగా అధికారులు, స్థానిక టీడీపీ నాయకులతో మాట్లాడి ఏయే గ్రామాలలో రోడ్లు, అవసరమో గుర్తించాలని ఎమ్మెల్యే సూచించడంతో పాటు రోడ్ల పనులు ఎంతవరకు వచ్చాయనే విషయంపై ఆయన ఆరా తీస్తున్నారు.

కొత్త రోడ్లు పూర్తయ్యాయి

మండలానికి ఉపాధి నిధుల కింద మంజూరైన సిమెంటు రోడ్ల నిర్మాణం దాదాపు పూర్తి అయినట్లే. మిగతావి కూడా త్వరలో పూర్తవుతాయి. ఇంకా గ్రామాలలో ఎక్కడెక్కడ రోడ్లు, మౌలిక వసతులు అవసరమో గుర్తిస్తున్నాం. అన్ని ప్రాంతాల్లో అవసరమైన మౌలిక సౌకర్యాలు తప్పకుండా కల్పిస్తాం.

\- జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీడీవో, పెండ్లిమర్రి

రేపటి నుంచి కోదండరామస్వామి మహోత్సవాలు

కడప కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం హౌసింగ్ బోర్డు కాలనీలో వెలసిన కోదండరామాలయం నిర్మించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 6 నుంచి 10వతేదీ వరకు మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం ఆ ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తొలుత మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. నగర ప్రజలు స్వామివారి సేవలో తరించాలని కోరారు.

బలపనూరులో పులి పిల్లలు ?

సింహాద్రిపురం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలపనూరు గ్రామంలో మంగళవారం పులి పిల్లలు సంచరిస్తూ కనిపించాయని గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు. గ్రామ చివార్లలో రెండు పులి పిల్లలు నెమళ్లను వెంటాడుతూ పొలం వద్ద ఉన్న రైతు కిషోర్‌రెడ్డి, మరి కొంత మందికి పొదల్లో కనిపించాయని, భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

కనులపండువగా శ్రీవారి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

చెన్నూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా చెన్నూరులోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం (కోట్లస్వామి), సరస్వతీనగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణం కనులపండువగా జరిగింది. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు కల్యాణం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల కల్యాణం తిలకించేందుకు మండల వ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున ఆలయాలకు తరలివచ్చారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఆ రెండు ఆలయాల్లో కల్యాణం పూర్తయిన ఉత్సవమూర్తులకు సాయంత్రం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. చెక్కభజనలు, కోలాటం, మంగళవాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

పోలీసు సంక్షేమానికి పెద్దపీట



డైరీని ఆవిష్కరిస్తున్న ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పోలీసు సంక్షేమానికి పెద్ద పీట వేస్తామని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ హామీ ఇచ్చారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర పోలీసు డైరీ 2025ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్షేత్ర స్థాయి పోలీసు సిబ్బందికి ఉపయోగపడే ప్రభుత్వ ఉత్తర్వులు, సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ, శాఖా పరమైన సంక్షేమ పథకాలపై సమగ్ర సమాచారాన్ని ఈ డైరీ ద్వారా సిబ్బందికి అందజేయడంపై అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ కె.ప్రకాశ్‌బాబు, ఆర్ఐలు ఆనంద్, టైటాస్, వీరేశ్, శ్రీశైలరెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, ఈసీ మెంబర్ ఏప్రిన్, మరియు సభ్యులు రామస్వామిరాజు, రాచరాయుడు, అంజి పాల్గొన్నారు.

కామన్ సీనియారిటీ ప్రకటించాలి

● డీఈఓకు యూటీఎఫ్ వినతి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): 2019లో పదోన్నతి పొందిన భాషోపాధ్యాయులందరికి కామన్ సీనియారిటీ ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు డీఈఓ శంషుద్దీన్ కోరారు. మంగళవారం సాయంత్రం డీఈఓ కార్యాలయంలో డీఈఓను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతీకరణలో భాగంగా భాషోపాధ్యాయులైన తెలుగు, హిందీ, ఉర్దూ, వ్యాయామ ఉపాధ్యాయులకు పాఠశాల సహాయకులుగా 2019 నవంబరు 1 నుంచి 4వ తేదీ వరకు పదోన్నతులు కల్పించడం అయింది. అయితేపదోన్నతి పొందిన తెలుగు, హిందీ, ఉర్దూ, వ్యాయామ ఉపాధ్యాయులు పాఠశాల సహాయకులుగా నవంబరు 1వ తేదీ నుంచి నాలుగో తేదీ వరకు వివిధ తేదీలలో చేరడం వలన బదిలీల సమయంలోను, పదోన్నతుల్లోను కొంతమేర స్పష్టత కొరవడి సీనియారిటీ విషయంలో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పదోన్నతి పొందిన పాఠశాల సహాయకులు తెలుగు, హిందీ, ఉర్దూ, వ్యాయామ ఉపాధ్యాయులకు 2019 నవంబరు 1 నుంచి కామన్ సినియారిటీగా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు రామకేశవ,చంద్రశేఖర్, కేదార్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుకాల పూజలు



విజయదుర్గాదేవి సన్నిధిలో రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

కడప కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం బిల్టప్ సర్కిల్ సమీపంలోని విజయదుర్గ ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు జిల్లా నలుమూలల నుంచే కాక రాయలసీమ జిల్లాల నుంచి కూడా భక్తులు హాజరై అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించి అమ్మసేవలో తరించారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 వరకు ఈ పూజలు నిర్వహించారు.

11 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు విజయ దుర్గాదేవి 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు మల్లికార్జునరావు, నిర్వాహకుడు దుర్గాప్రసాద్ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

అబాకస్‌లో నాగార్జున విద్యార్థుల ప్రతిభ



బహుమతులతో విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి అబాకస్ పోటీల్లో కడప నాగార్జున ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పాఠశాల కరస్పాండెంట్ కె.శివతులశమ్మ తెలిపారు. శ్రీనిధి రెడ్డి రియాన్‌ఖాన్ ప్రథమ బహుమతి సాధించాలన్నారు. కాశ్విరెడ్డి, ఆయుష్పాల్, శివ, సాహితి, మోహితారెడ్డి, దివ్య, వర్షిత ద్వితీయ బహుమతి పొందాలన్నారు. వీరిని పాఠశాల డైరెక్టర్ కె.శివప్రసాద్‌రెడ్డి అడ్మిన్ సుశీలదేవి విద్యార్థులను అభినందించారు.

దేవునికడపలో అన్నదానం



అన్నదానం చేస్తున్న పవన్‌లక్ష్మి వెంకటేశ్వర టూర్స్ అండ్ ట్రావెల్స్ యాజమాన్యం

కడప కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భాన్ని పురష్కరించుకుని తిరుమల తొలిగడప దేవుని కడప శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి తిరుణాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం వెంకటేశ్వర టూర్స్ అండ్ ట్రావెల్స్ వారి ఆధ్వర్యంలో పుత్తా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి 13వ జ్ఞాపకార్థం పురస్కరించకుని సుమారు 5వేల మందికి అన్నదానం చేశారు. ఇందులో మజ్జిగ ప్యాకెట్లు, నీళ్ల ప్యాకెట్లు అందించి భక్తుల మన్ననలు పొందారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎం.కేశవకుమార్, ఎంఎం మురుగేశం, పుత్తా రామసుబ్బారెడ్డి, సులోచనమ్మ, పుత్తా పవన్‌కుమార్‌రెడ్డి, కదిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'పులివెందులకు ఉప ఎన్నిక ఖాయం'

లింగాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గానికి ఉప ఎన్నిక తప్పని సరిగా వస్తుందని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. మండలంలోని వెలిదండ్ల వద్ద లింగాల కుడికాల్వ నుంచి బియాండ్‌తాతిరెడ్డిపల్లె ఎత్తిపోతల పథకానికి మంగళవారం ఆయన నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ చెప్పిన విధంగా జగన్ మోహన్‌రెడ్డి మీద అనర్హత వేటు పడుతుందని, తద్వారా ఉప ఎన్నిక వస్తుందన్నారు.

'పార్టీ పటిష్టతకు సమష్టి కృషి'

వేంపల్లె, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పటిష్టతకు అందరు సమిష్టిగా మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన 47 మంది మండల కమిటీ సభ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కష్టపడి పనిచేసే కార్యకర్తకు భవిష్యత్తులో మంచి జరుగుతుందన్నారు.

వేడుకగా రథసప్తమి పూజలు

వేంపల్లె, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో రథసప్తమి పర్వదినం పురస్కరించుకొని వేడుకగా పూజలు చేశారు. స్థానిక వేంకటేశ్వరస్వామి, సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో ఉత్సవ మూర్తులతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆర్యవైశ్యమహిళా మండలి ఆధ్వర్యంలో రథసప్తమి సందర్భంగా పొంగలి నిర్వహించారు. ఆవోపా మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈ పూజలు చేశారు.

ప్రైవేటు పాఠశాలలకు సహకరిస్తాం

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలను ఆదుకుంటామని ఏపీ రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంగళవారం ఏపీ రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రిని అమరావతి లోని ఆయన నివాసంలోరాష్ట్రంలో గుర్తింపు పొందిన ప్రైవేటు విద్యాసంస్థల వివిధ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర సాంస్కృతిక శాఖ కన్వీనరు, విద్యాధరి విద్యాసంస్థల అధినేత డి.భానుప్రకాశ్ పాల్గొని మాట్లాడారు. అందుకు మంత్రి స్పందిస్తూ ప్రైవేటు పాఠశాలలను ఆదుకుంటామన్నారు.

దయగల తల్లి లూర్దుమాత

కడప కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సర్వపాపులను తన బిడ్డలుగా భావించి ప్రేమాభిమానాలు పంచిన దయ గల తల్లి లూర్దుమాత అని పులివెందుల విచారణ గురువులు ఫాదర్ లక్కినేని ఆరోగ్యస్వామి కొనియాడారు. మరియాపురం లూర్దుమాత తిరుణాల మహోత్సవాల్లో భాగంగా నవదిన పూజలను మంగళవారం పాత చర్చి ఆవరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కీడు తలపెట్టిన వారిని సైతం అక్కున చేర్చుకునే దయామయి అన్నారు.

కనీస వసతులు లేని ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని రద్దు చేయాలి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కనీస వసతులు లేని జూనియర్ కళాశాలలను ఇంటర్ మీడియట్ పరీక్ష కేంద్రంగా ఏర్పాటు చేశారని, వాటిని వెంటనే రద్దుచేయాలని ఏఐఎస్ఎబీ ఎఫ్‌బీఐ ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్ఐఓ కార్యాలయంలో ఆర్ఐఓ వెంకటసుబ్బయ్యకి వినతిపత్రం సమర్పించారు. అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడులు మాట్లాడుతూ ఇంటర్‌మీడియట్ పబ్లిక్ పరీక్షలకు మౌలిక వసతులు లేకుండా ఆ కళాశాలలో పరీక్ష ఏ విధంగా నిర్వహిస్తారన్నారు.

మున్సిపల్ కార్మికుడి చికిత్సకు రూ.లక్ష సాయం



శివకుమార్ కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న మేయర్ సురేశ్‌బాబు, కార్పొరేటర్లు

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కడప నగర పాలక సంస్థలో పీహెచ్ వర్కర్‌గా పనిచేస్తున్న శివకుమార్ బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతుండటంతో అతని చికిత్స కోసం మేయర్ సురేశ్‌బాబు ఆధ్వర్యంలో కార్పొరేటర్లు అందరూ కలిసి రూ.లక్ష సాయం ప్రకటించారు. మంగళవారం మేయర్ క్యాంప్ కార్యాలయంలో అతని కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రామ్‌లక్ష్మణ్‌రెడ్డి, ఐస్‌క్రీమ్ రవి, త్యాగరాజు, రామకృష్ణారెడ్డి, రెడ్డిప్రసాద్, కడప వైసీపీ నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడు కంచుపాటి బాబు తదితరులు పాల్గొన్నారు.

జియాలజీ విద్యార్థులకు వీసీ ప్రశంస

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌లో ఇంటర్న్‌షిప్ పూర్తిచేసుకున్న వైవీయూ జియాలజీ శాఖ విద్యార్థులను యోగివేమన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, ప్రధానాచార్యులు ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, కులసచివులు ఆచార్య పుత్తా పద్మ అభినందించారు. ఎన్.జి.పి.ఆర్.ఐలో అప్రెంటిషిప్ కోసం దేశవ్యాప్తంగా 400 మంది దరఖాస్తు చేయగా ఆ సంస్థ 20 మందిని ఎంపిక చేయడం సంతోషకరమన్నారు.

రమణీయం.. శ్యామలాదేవి గ్రామోత్సవం



బుద్దాయపల్లెలో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

చెన్నూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బుద్దాయపల్లెలో శ్యామలదేవి గ్రామోత్సవం మంగళవారం రాత్రి స్థానిక వైభవంగా నిర్వహించారు. పుష్పగిరి రోడ్డులోని మాతంగి శ్యామలదేవి ఆలయం నుంచి మూల విరాట్ మూర్తిని మంగళవాయిద్యాలతో తీసుకువచ్చి వీధివీధినా ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే పుట్టా



మైదుకూరు రూరల్ ,ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : చంద్రబాబును మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ మంగళవారం అమరావతిలోని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గత నెలలో సీఎం మైదుకూరు పర్యటన నిమిత్తం వచ్చినప్పుడు ఇచ్చిన హామీలతో పాటు మరి కొన్ని నియోజకవర్గ సమస్యలను పుట్టా సుధాకర్‌యాదవ్ సీఎంతో చర్చించారు. మైదుకూరులో సీఎం ఇచ్చిన హామీలకు నిధులను మంజూరు చేయాలని కోరారు.అంతేకాకుండా పట్టణం లో వంద పడకల ఆసుపత్రి తదితర అంశాలపై కూడా చంద్రబాబుతో పుట్టా సుధాకర్‌యాదవ్ చర్చించారు.మైదుకూరులో ప్రజల సమక్షంలో ఇచ్చిన హామీలకు వెంటనే రిపోర్టులను తయారు చేయాలని సీఎం అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే పుట్టా తెలిపారు.

మంత్రి లోకేశ్‌నూ...: మంత్రి నారా లోకేశ్‌ను మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ కలిశారు. మంగళవారం విజయవాడలోని లోకేశ్ నివాసంలో ఎమ్మెల్యే పుట్టా కలిశారు. నియోజకవర్గంలోని పలు సమస్యలపై ఆయనతో చర్చించారు.సమస్యల పరిష్కారంపై లోకేశ్ సానుకూలంగా స్పందించారని, అలాగే నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల గురించి మాట్లాడినట్లు పుట్టా తెలిపారు.



వైభవంగా రథసప్తమి వేడుకలు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి పర్వదినం పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. తిరుమల, తిరుపతి దేవస్థానం శ్రీవారి సేవా సమితి ఆధ్వర్యంలో రథసప్తమి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పాల్గొని పూజలు చేసి మొక్కుకున్నారు. టేకురథంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఊరేగింపు నిర్వహించారు. ముందుగా ఆలయంలో భక్తులు పూలు, టెంకాయలు సమర్పించి ఆలయం చుట్టూ రథోత్సవం నిర్వహించారు. భక్తులకు ప్రసాదం వినిమయం చేశారు. ఈ కార్యక్రమంలో చదిపిరాళ్ల పుల్లారెడ్డి, మోహన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నవనీశ్వర్‌రెడ్డి, సునీల్, పుల్లయ్య, జితేంద్ర, ఓబుళరెడ్డి, సీఐ గోపాల్‌రెడ్డి, ఎస్ఐ రామకృష్ణ, శ్రీవారి సేవా సమితివారు పాల్గొన్నారు.

బద్వేలు..: నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం రథ సప్తమి వేడుకలను ప్రజలు నిర్వహించారు. బద్వేలు పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. లక్ష్మీపాళెం గ్రామం లో సూర్య ప్రభ వాహనంపై శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారుజామునుంచే బారులు తీరారు.



జమ్మలమడుగులో టేకు రథంలో ఊరేగుతున్న నారాపురం వేంకటేశ్వరస్వామి

కొండాపురం..: మండలంలోని తాళ్లప్రొద్దుటూరు లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆలయం ఎదురుగా నెయ్యిపోసి, అందులో సూర్యభగవానుని ప్రతిబింబం చూస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు.రథసప్తమి రోజున సూర్య భగవానుని ఆరాంధిచడం వల్ల సకల శుభాలు చేకూరుతాయని అర్చకుడు జగన్‌స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మిట్టా చిన్న అంకిరెడ్డి, మిట్టాపుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: రథసప్తమి వేడకలు పోరుమామిళ్లలో ఘనంగా జరిగాయి. మంగళవారం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే కాల్వ కట్ట సమీపంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ప్రొద్దుటూరు టౌన్..: రథసప్తమి పర్వదినం సందర్భంగా పాత మార్కెట్‌లోని మహాలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో వేద పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి సుందరంగా అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి ఆలయ ప్రాంగణంలో అశ్వవాహనంపై కొలువుదీర్చారు.

సాయంత్రం గోవిందనామస్మరనలతో పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. లలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో లలితాదేవి, శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించి పూలమాలలతో అలంకరించారు.

బద్వేలు రూరల్..: రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం మండల పరిధిలోని లక్ష్మీపాలెం గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమివేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం సప్తఅశ్వాలు కలిగిన రథంపై శ్రీనివాసుడు గ్రామవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాలకు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.






బద్వేలు..సూర్య ప్రభ వాహనంపై దర్శనమిస్తున్న శ్రీవారు, కొండాపురం...తాళ్లప్రొద్దుటూరులో నెయ్యిలో సూర్యభగవానుని ప్రతిబింబాన్ని చూస్తూ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం, ప్రొద్దుటూరు.. చెన్నకేశవస్వామి ఆలయం వద్ద అశ్వవాహనంపై కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులు, బద్వేలు... లక్ష్మీపాలెంలో సప్తఅశ్వాల రథంపై ఊరేగుతున్న శ్రీనివాసుడు

జంక్ ఫుడ్‌తో క్యాన్సర్ ముప్పు

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యకరమైన జీవన శైలితో పాటు ముందస్తు పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను నివారించవచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బి శివప్రసాద్ తెలిపారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా యూపీహెచ్‌సీ టీబీ రోడ్ ఆధ్వర్యంలో లేపాక్షి డిగ్రీకళాశాలలో విద్యార్థులకు అవగాహస సదస్సు నిర్వహించారు. అనంతరం పట్టణంలో క్యాన్సర్ అవగాహనా ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివప్రసాద్, లేపాక్షి డిగ్రీకాలేజీ ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి , యూపీహెచ్‌సీ సీవో ఎంవీ సుబ్బారెడ్డి కళాశాల బాలికలు, ఆరోగ్య కార్యకర్తలు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: రోడ్డు మీద ఫాస్టు ఫుడ్ సెంటర్లలో దొరికే జంక్ ఫుడ్‌లతో క్యాన్సర్ ముప్పు వాటిల్లుతుందని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ పీఎస్ బ్రహ్మేశ్వర కుమార్ తెలిపారు. మంగళవారం డాక్టర్ యోగానందరెడ్డి ఆసుపత్రిలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్ వలన కలిగే దుష్ప్రభావాలపై పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఐడీఏ అధ్యక్షుడు డాక్టర్ యోగానందరెడ్డి, ట్రెజరర్ రామక్రిష్ణ , వైద్యులు డాక్టర్ తేజ, డాక్టర్ లక్ష్మీకిషోర్ డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ రాజశేకర్, డాక్టర్ అమిన్, డాక్టర్ మానస, డాక్టర్ శ్వేత, డాక్టర్ దీపిక పాల్గొన్నారు.

బి.కోడూరు..: బి.కోడూరు మండల ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినంపై ర్యాలీని వైద్యాధికారులు వినీత్‌కుమార్‌రాజు, ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంటివైద్యాధికారి హుస్సేనయ్య, పుష్పాంజలి, రామతీర్థం, ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



బీకోడూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

పోరుమామిళ్ల..: క్యాన్సర్ వ్యాధిని సకాలంలో గుర్తించాలని టేకూరుపేట వైద్యాధికారి మేరీ ఎల్సా అన్నారు. మంగళవారం టేకరుపేట ప్రాధమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రపంచ కేన్సర్ దినం సందర్భంగా ర్యాలీలు,సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సాదు వెంకటేశ్వర్లు, రఘురాం సరస్వతి పాల్గొన్నారు.

కాశినాయన..: క్యాన్సర్ మహమ్మారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి ప్రశాంతి పేర్కొన్నారు. .మంగళవారం నర్సాపురంలో స్థానిక ప్రాధమిక ఆరోగ్యకేంద్రంలో పనిచేస్తున్న అధికారులు,సిబ్బంది,ఆశాకార్యకర్తలు క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణాధికారి బాలయ్యవైద్యసిబ్బంది చంద్ర పలువురు ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బి.కోడూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బి.కోడూరు మండల సర్వసభ్యసమావేశం బుధవారం జరగనున్నట్లు ఎంపీడీవో భాస్కర్‌రావు తెలిపారు. ఈ సమావేశం ఉదయం 10గంటలకు జరగనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన అన్నారు. ఈ సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రయాణికులకు బస్సులు సౌకర్యంగా ఉండాలి

ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణికులకు బస్సులు సౌకర్యవంతంగా ఉండాలని ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం మెకానిక్, కోచ్ వెల్డర్స్, ట్రిమ్మర్‌లతో మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు బస్సులకు అవసరం అయిన మరమ్మతుల విషయంలో అలసత్వం చూపవద్దన్నారు.కార్యక్రమంలో గ్యారేజ్ ఇన్‌చార్జ్ రాజశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ బాలయ్య, సూపర్ వైజర్లు, మెకానిక్‌లు తదితరులు పాల్గొన్నారు.

విదేశీ బీమా కంపెనీల ప్రవేశాన్ని వ్యతిరేకించాలి

బద్వేలు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంటు బడ్జెట్ సమావేశాలలో బీమా చట్ట సవరణ బిల్లు 2024ను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని దీనిని వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టే ఈ బీమావలన పాలసీదారులకు, దేశానికి ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఈ సవరణ బిల్లు రూపొందితే జాతీయకరణకు ముందు నాటి ప్రైవేటు కంపెనీల మోసాలు పునరావృతమవుతాయని అన్నారు.

దుస్తుల పంపిణీ

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లలోని వైష్ణవి ఇంగ్లీషు మీడియం స్కూలు విద్యార్థులు వివేకానందాశ్రమాన్ని సందర్శించి అక్కడ వృద్ధులకు దుస్తులు, పండ్లు, కూరగాయలు అందించి తమ సేవా భావం చాటుకున్నారు. మంగళవారం వారు ఓబులాపురం సమీపంలో ఉన్న వివేకానంద సేవాశ్రమాన్ని సందర్శించారు. ఉపాధ్యాయులు కూడా ఆర్థిక సాయం అందించి ఆశ్రమ వాసులకు భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకుడు రామక్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైయాష్ టిప్పర్లపై సీఐకి ఫిర్యాదు

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఫ్లైయాష్ టిప్పర్లు, ట్యాంకర్లను చిలమకూరు గ్రామంలోకి రానివ్వకూడదని చిలమకూరుకు ప్రజలు ఎర్రగుంట్ల సీఐ నరేష్‌బాబుకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో నుంచి వెళుతున్న ఫ్లైయాష్ టిప్పర్లను మంగళవారం ప్రజలు అడ్డుకున్నారు. ఫ్లైయాష్ టిప్పర్లు, ట్యాంకర్ల వల్ల గ్రామంలో తీవ్ర కాలుష్యం వస్తోందని, దుమ్ము ఇళ్లలోకి వస్తోందని సీఐకి తెలిపారు. ఈవిషయంపై టిప్పర్లు రాకుండా చూస్తామని సీఐ హామీ ఇచ్చారు.

ఉపాధి హామీ కూలీలకు రోజువారీ వేతనం పెంచాలి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీలకు రోజువారి వేతనం రూ.700లకు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. మంగళవారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బడా నేతలకు పనులు చేయించి అధికారులు ఉపాధి హామీ పనుల్లో వాటి చేర్చడం సిగ్గుచేటు అన్నారు. జిల్లా అధికారులు నియోజకవర్గంలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నవీన్, నాగేంద్ర, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నడిపే వాహనాలపై చర్యలు

ప్రొద్దుటూరు ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మోటార్ వెహికల్ చట్టం నిబంధనలకు విరుద్దంగా నడిపే వాహనాలను సీజ్ చేస్తామని ఆర్‌టీవో మురళీ హెచ్చరించారు. మంగళవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా స్థానిక ఎర్రగుంట్ల రోడ్డు వాసవి సర్కిల్లో రవాణా అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో పోలీసు డిపార్ట్ మెంటు, ఆర్‌టీసీ అధికారులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలకు బెంచీల వితరణ

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మోడంపల్లె మున్సిపల్ హైస్కూలులో విద్యార్థులకోసం ఐడీబీఐ బ్యాంకు కార్పొరేట్ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా బెంచీలను అందజేసింది. వంద మంది విద్యార్థులకు రూ.1.50 లక్షలు విలువైన 50 బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బందిని టౌన్ బ్యాంకు చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.మల్లికార్జున , డిప్యూటీ డీఈవో యు.మీనాక్షి, పాఠశాల హెచ్‌ఎం ఇమామ్‌హుస్సేన్, ఐడీబీఐ బ్యాంకు జనరల్ మేనేజర్ మృదుల, టౌన్‌బ్యాంకు సీఈవో నిరంజన్‌రెడ్డి, ఐడీబీఐ బ్యాంకు మేనేజర్ మధుసూదన్‌రెడ్డి, బయపురెడ్డి, పవన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం

మైదుకూరు రూరల్,ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : స్థానిక సాయినాథపురం ప్రాథమిక పాఠశాలలో రిటైర్డ్ ఉద్యోగులు సర్వసభ్య సమావేశంలో జరుగుతుందని ఆ ఉద్యోగుల ప్రెసిడెంట్ చిగురుపాటి సుబ్బరాయుడు మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు.ఈ సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

జూదరులు అరెస్టు

దువ్వూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం చింతకుంట వద్ద జూదం ఆడుతున్న అయిదుగురు వ్యక్తులను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. జూదం ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3,200 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

ఎగిసిపడుతున్న మంటలు



ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు శివారులోని మడూరు రోడ్డులో పొలాల్లో ఉన్న గడ్డి తగలబడడంతో మంటలు ఎగిసిపడుతున్నాయి. మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు పొలాల్లో ఫైర్లు కాలుస్తుండగా చుట్టుపక్కల ప్రాంతాలకు పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. దీంతో భారీగా వాయుకాలుష్యం వెలువడుతోంది. మంటలు అదుపులోకి రాకపోతే కొత్తపల్లె నివాస ప్రాంతాలకు చేరుకునే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



మంత్రి సవితకు సర్పంచుల వినతి

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లి గ్రామ పంచాయతీలో 50 వేల జనాభా ఉన్నారని, అభివృద్ధి పనులు, నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ రిజిస్ట్రేషన్ శాఖ నుంచి వచ్చే స్టాంపు డ్యూటీ ఫీజులు రానందున అభివృద్ధి కుంటుపడిందని వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జిమంత్రి ఎస్ సవితను కొత్తపల్లి సర్పంచ్ కె.శివచంద్రారెడ్డి కోరారు. మంగళవారం జిల్లాకు వచ్చిన మంత్రిని కలిసి పలువురు సర్పంచులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నరేష్‌రెడ్డి, మత్తయ్య, కొండయ్య, చంద్రశేఖర్,శ్రీనివాసులరెడ్డి తదితర సర్పంచ్‌లు మంత్రి, కలెక్టర్‌కు విన్నవించారు.

సమస్యలు పరిష్కరించాలి

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆశా కార్యకర్తలసమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గంటి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం టేకూరుపేటలో ఇతర సంఘాల వారు ఏఐటీయూసీలో చేరారు. ఈ సందర్భంగా వారికి శాలువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బేగం, రిజ్వానా, చిన్నమ్మ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిక్షేత్ర సమస్యను పరిష్కరించండి

కాశినాయన ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): మండలంలోని జ్యోతిక్షేత్రంలో ఫారెస్ట్ ల్యాండ్ సమస్యను పరిష్కరించేందుకు దృష్టిసారించాలని బద్వేల్ నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త కే.రితేష్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు ఎం.రాజారెడ్డి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి తదితరులు జిల్లా ఇంచార్జి మంత్రి సబితాను కలిసి కోరారు. మంగళవారం కడప పట్టణానికి వచ్చిన మంత్రి సవితాను కలిసి జ్యోతి క్షేత్ర సమస్యను ఆమె దృష్టికి తెచ్చారు.



మంత్రిని కలిసిన టీడీపీ నాయకులు